సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 1 । జూలై । 2023



డెల్టాలకు 7,660 క్యూసెక్కులు

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి శుక్రవారం 7,660 క్యూసెక్కుల గోదావరి జలాలు వదిలారు. తూర్పు 2,130, సెంట్రల్ 1,530, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు విడుదల చేశారు.



చేయందించమంది ఒక ప్రాణం

దేవుడు ప్రాణాలు పోస్తే.. వైద్యులు ప్రాణాలను కాపాడతారు. అందుకే వైద్యో నారాయణో హరిః అన్నారు పెద్దలు. నేడు డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం - IIలో▸

గరిష్టం/కనిష్టం
41.0°/27.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.0	27.5
కాకినాడ	36.9	28.2
అమలాపురం	38.0	27.5

పంట చేనులో రుణానందలహరి



- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచిన ప్రభుత్వం
- డీసీసీబీ నుంచి గత ఏడాది ఖరీఫ్‌లో రూ.502 కోట్ల పంట రుణాలు
- ఈ ఏడాది రూ.895 కోట్లకు పెంపు
- రైతుల సాగు పెట్టుబడులకు తప్పనున్న ఇబ్బందులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రైస్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పిలిచే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్ పెట్టుబడికి రైతులకు అయ్యే ప్రతి పైసాకూ రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఖరీఫ్‌లో రుణపరపతి కల్పించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా రైతుల కోసం రూపొందించిన ఖరీఫ్ రుణ ప్రణాళికకు రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఖరీఫ్‌కు సంబంధించి మే నుంచి సెప్టెంబర్, రబీలో అక్టోబర్ నుంచి మార్చి వరకూ సహకార సంఘాల ద్వారా రుణాలిస్తారు. ప్రస్తుతం వరుణుడు ముఖం చాటేయడంతో అటు మెట్ట, ఇటు డెల్టా ఆయకట్టులో వరి నాట్లు కొంత ఆలస్యమవుతున్నాయి. నాట్లు ఎప్పుడు ప్రారంభించినా పెట్టుబడికి రైతులు ఇబ్బంది పడకూడదనే ముందుచూపుతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ముందస్తు ఏర్పాట్లు చేసింది. పరపతి కోసం వడ్డీ వ్యాపారులు, ధాన్యం కమీషన్ ఏజెంట్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంది.

కాకినాడలోని డీసీసీబీ ఉమ్మడి జిల్లాలోని ప్రతి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలో నిర్దేశించిన పరపతి అందజేయనుంది. రైతులకు రుణాలివ్వడంలో వాణిజ్య బ్యాంకులు కూడా పోటీ పడుతున్నా.. పీఏసీఎస్‌ల స్థాయిని మాత్రం అవి అందుకోలేకపోతున్నాయి. 90 శాతం మంది రైతులు పీఏసీఎస్‌ల ద్వారానే రుణాలు పొందుతున్నారు. పంట రుణాలపై వడ్డీ 7 శాతం ఉండటం, తీసుకున్న రుణాన్ని ఏడాది లోపు చెల్లించేసి, తిరిగి రుణం పొందే అవకాశం ఉండటంతో రైతులు ఎక్కువగా పీఏసీఎస్‌ల వైపే మొగ్గు చూపుతున్నారు.

30 శాతం అధికంగా..

ఈ నేపథ్యంలో పెరుగుతున్న వ్యవసాయ పెట్టుబడులకు అనుగుణంగా రుణపరిమితి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నిర్ణయం తీసుకుంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బ్యాంకర్లు కూడా రైతులకు అధికంగా రుణాలు అందించేందుకు ముందుకు వచ్చారు. గత ఏడాది ఖరీఫ్‌తో పోల్చితే ఈ ఏడాది వరితో పాటు ఉద్యాన, ఆక్వా రంగాలకు రుణ పరపతిని ఎకరాకు అదనంగా రూ.10 వేలకు పెంచుతూ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయం తీసుకొంది. ఉమ్మడి జిల్లాలో గత ఏడాది వరి రైతుకు ఎకరాకు రూ.38 వేల వరకూ రుణ పరపతి కల్పించారు. దీనిని ఈసారి రూ.45 వేలకు పెంచారు. ఈసారి 20 నుంచి 30 శాతం అధికంగా పరపతి కల్పించనుండటంతో ఖరీఫ్ పెట్టుబడులకు ఇబ్బందులు తప్పుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాల వారీగా సాగు విస్తీర్ణం, రైతుల వివరాలు

జిల్లా	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	రైతులు
కాకినాడ	1,96,000	1,65,000
కోనసీమ	1,83,000	1,10,000
తూర్పు గోదావరి	1,95,396	1,25,000

రూ.393 కోట్లు పైనే అదనపు పరపతి

ఈ ఖరీఫ్‌లో రూ.895 కోట్ల మేర పంట రుణాలు ఇవ్వాలని డీసీసీబీ ప్రణాళిక సిద్ధం చేసింది. గత ఏడాది ఇదే సీజన్‌లో రూ.502 కోట్లు మాత్రమే రుణాలివ్వగా, ఈసారి అదనంగా రూ.393 కోట్లు రుణ పరపతి కల్పిస్తోంది. రైతులు అత్యధికంగా సాగు చేసే వరితో పాటు ఉద్యాన పంటలకు కూడా రుణ పరిమితి పెంచడంతో రుణ ప్రణాళిక కూడా పెరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 డీసీసీబీ బ్రాంచిలు, 296 పీఏసీఎస్‌ల ద్వారా ప్రతి రైతుకూ రుణం అందించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

దీర్ఘకాలిక రుణాల్లోనూ పెరుగుదల

డీసీసీబీ అందిస్తున్న దీర్ఘకాలిక రుణాలకు సంబంధించిన ప్రణాళికలో కూడా పెరుగుదల కనిపిస్తోంది. గత ఖరీఫ్‌లో 45 వేల మంది రైతులకు రూ.326 కోట్ల మేర దీర్ఘకాలిక రుణాలు అందించారు. ఈ సీజన్‌లో రూ.375 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఖరీఫ్‌లో స్వల్పకాలిక రుణాలు కాకుండా ఇతర రుణాలు రూ.1,015 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా, రూ.725 కోట్లు అందజేశారు. ఈసారి కూడా అదే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

రైతు ఇంటికే వెళ్లి రుణాలు



ఖరీఫ్ పంట రుణాలతో పాటు, రైతులకు దీర్ఘకాలిక రుణాలు, వారి పిల్లలకు విద్యారుణాలు, బంగారు నగలపై కూడా రుణాలు ఇస్తున్నాం. వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే అన్ని రకాల రుణాలూ అందిస్తున్నాం. రైతులు తమ అవసరాలకు రుణం కోసం సహకార సంఘాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా రైతు ఇంటికే వెళ్లి సహకార శాఖ సిబ్బంది రుణాలు అందిస్తున్నారు.

– ఆర్వీ నరసింహారావు, సీఈఓ, డీసీసీబీ, కాకినాడ

బెడద తప్పుతుంది



గతంలో పంట వేయాలంటే ప్రైవేటు అప్పుల కోసం ఎక్కే గుమ్మం దిగే గుమ్మం అన్నట్టు ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం ముందుగానే సొసైటీల ద్వారా రుణాలివ్వడానికి ఏర్పాట్లు చేస్తూండటం సంతోషాన్నిస్తోంది. దీంతో అధిక వడ్డీలకు అప్పులు తీసుకోవాల్సిన బెడద తప్పుతుంది.

– అప్పారి చిన్న వెంకట రమణ, రైతు, నల్లమిల్లి, అమలాపురం రూరల్

8, 9 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన స్థానిక నారాయణపురంలోని కేఎస్ఎన్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8, 9 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారు. స్టేడియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీవీ త్రినాథ్ ఈ విషయం తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పర్యవేక్షణలో కొత్తపల్లి సత్యనారాయణ మెమోరియల్ టోర్నమెంట్ పేరిట ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అండర్–11, 13, 15, 17, 19, మెన్స్ విభాగాల్లో జరిగే ఈ పోటీల నుంచి రాష్ట్ర స్థాయికి క్రీడాకారులను ఎంపిక చేస్తామని చెప్పారు.

న్యూస్‌రీల్

ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా బాలమురళీకృష్ణ



బాలమురళీకృష్ణకు నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం సిటీ: ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ నాయకుడు కొత్త బాలమురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు శుక్రవారం రాజమహేంద్రవరంలో నియామక పత్రం అందజేశారు. త్వరలో జిల్లా అధ్యక్ష ప్రమాణ స్వీకారం రాజమహేంద్రవరంలో నిర్వహిస్తామని శ్రీనివాసరావు తెలిపారు. బాలమురళీకృష్ణ వ్యాపార రంగంలో మంచి పేరు తెచ్చుకున్నారని, లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవలందించారని, వైశ్య సంఘాల అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు.

ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్ష పరిశీలన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక శ్రీనివాస రామానుజన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షను జిల్లా పరిశీలకుడు డి.మధుసూదనరావు శుక్రవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో సౌకర్యాలను తనిఖీ చేశారు. గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

హనీకి పాఠశాలలో ఉచితంగా ప్రవేశం

అమలాపురం రూరల్: అల్లవరం మండలం నక్కా రామేశ్వరం గ్రామానికి చెందిన కొప్పాడి రాంబాబు, నాగలక్ష్మి దంపతుల కుమార్తె హనీ అరుదైన వ్యాధితో బాధపడుతుండడంతో తల్లిదండ్రుల ద్వారా తెలుసుకొని ఆరోగ్యం భవిష్యత్తు గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం జగన్ గత అక్టోబర్ నెలలో రూ.కోటి మంజూరు చేశారు. శుక్రవారం పాప హనీ చదువుపై కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక చొరవ తీసుకొని కలెక్టరేట్ చాంబర్‌లో పాప హనీకి అక్షరాభ్యాసం చేయించారు. కామనగరువులో ఉన్నత అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ఉచితంగా ప్రవేశం కల్పించి పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో పాప తల్లిదండ్రులు కొప్పాడి రాంబాబు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వానమ్మా.. జాడ ఏదమ్మా..!

- మూడు రోజులుగా మండిపోతున్న ఎండలు
- మళ్లీ 40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు
- జూన్‌లో సాధారణం కంటే 25 శాతం తక్కువగా వర్షపాతం
- దేవరపల్లి మండలంలో ఏకంగా 61 శాతం తక్కువ



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న కొవ్వూరు బస్టాండ్ సెంటర్

కొవ్వూరు: చల్లని జల్లులతో కొద్ది రోజుల కిందట మురిపించి, భూతాపాన్ని కాస్త చల్లార్చిన వరుణుడు మళ్లీ ముఖం చాటేస్తున్నాడు. అసలే ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు రావడమే చాలా ఆలస్యమైంది. దీంతో జిల్లాలో జూన్ నెలలో సాధారణం కంటే 25 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో జూన్ 25, 26, 27 తేదీలు మినహా మిగిలిన రోజుల్లో చెప్పుకోదగిన వర్షం కురవలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఖరీఫ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గోదావరి డెల్టా ఆయకట్టులోను, బోర్లు, ఎత్తిపోతల పథకాల కింద రైతులు మురగ దమ్ములు చేసుకుంటున్నారు. ఈ తరుణంలో వర్షాలు ముఖం చాటేయడం మెట్ట ప్రాంత రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. వర్షాధారంగా సాగు చేసే రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.

హీటెక్కిపోతోంది

జిల్లాలో నాలుగు రోజుల నుంచి మళ్లీ ఎండ తీవ్రత పెరుగుతోంది. దీనికి ఉక్కపోత తోడు కావడం జనం అల్లాడిపోతున్నారు. రాజమహేంద్రవరంలో జూన్ 27న 33.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉన్న ఉష్ణోగ్రత గురువారం 40.5 డిగ్రీలకు పెరిగింది. అంతకుముందు కూడా 39.5 డిగ్రీల వరకూ నమోదవుతోంది. కొవ్వూరు, దేవరపల్లి, తాళ్లపూడి, చాగల్లు, నిడదవోలు, కోరుకొండ, గోపాలపురం, నల్లజర్ల, గోకవరం, రాజానగరం మండలాల్లో కూడా 38 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో జూన్ 25, 26 తేదీల్లో వరుసగా వర్షాలు కురవడంతో ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీల వరకూ తగ్గింది. ఆ సమయంలో 33 నుంచి 34 డిగ్రీల వరకూ ఉన్న ఉష్ణోగ్రతలు మూడు రోజులుగా క్రమంగా పెరుగుతూ మళ్లీ 40 డిగ్రీల మార్కును దాటేస్తూండటంతో జనం ఉష్ణతాపానికి అల్లాడుతున్నారు.

జూన్‌లో జిల్లా వర్షపాతం వివరాలు

సాధారణ వర్షపాతం	:	117 మిల్లీమీటర్లు
కురిసినది	:	87.4 మిల్లీమీటర్లు
వ్యత్యాసం	:	25 శాతం తక్కువ
అధికంగా వర్షపాతం నమోదైన మండలం	:	తాళ్లపూడి (94 శాతం అధికం)
అత్యల్ప వర్షపాతం	:	దేవరపల్లి (61 శాతం తక్కువ)
సాధారణ వర్షపాతం	:	5 మండలాలు
తక్కువ వర్షపాతం	:	11 మండలాలు

వాన జాడ ఎనిమిది రోజులే..

చెదురుమదురు వర్షాలతో కలిపి జూన్ నెల మొత్తం మీద ఎనిమిది రోజులు మాత్రమే వాన జాడ కనిపించింది. జూన్‌లో జిల్లా సాధారణ వర్షపాతం 117 మిల్లీమీటర్లు కాగా, 87.4 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో నాలుగు రోజులుగా చినుకు జాడే లేదు. 29వ తేదీన గోకవరం, తాళ్లపూడి మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. మరో ఆరు మండలాల్లో చిరు జల్లులు కురిశాయి. ఒక్క తాళ్లపూడిలో సాధారణం కంటే 94 శాతం అధికంగా వర్షపాతం రికార్డయ్యింది. ఈ మండలంలో సాధారణ వర్షపాతం 129.2 మిల్లీమీటర్లు కాగా, ఏకంగా 251.2 మిల్లీమీటర్లు నమోదైంది. ఉండ్రాజవరం, సీతానగరం, అనపర్తి, చాగల్లు, నల్లజర్ల మండలాల్లో సాధారణ వర్షపాతమే రికార్డయ్యింది. ఉండ్రాజవరంలో 16 శాతం, చాగల్లులో 7.4 శాతం అధిక వర్షపాతం నమోదైంది. వర్షపాతం 20 శాతం తక్కువ లేదా ఎక్కువగా ఉన్నా సాధారణంగానే పరిగణిస్తారు. దేవరపల్లి మండలంలో ఏకంగా 61 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. ఇక్కడ సాధారణ వర్షపాతం 103.8 మిల్లీమీటర్లు కాగా, 40.2 మిల్లీమీటర్లు మాత్రమే రికార్డయ్యింది. గోకవరం, కొవ్వూరు, రాజమహేంద్రవరం అర్బన్‌లో సైతం 50 శాతం పైబడి తక్కువ వర్షపాతం నమోదైంది. తరువాతి స్థానాల్లో రాజానగరం, నిడదవోలు, బిక్కవోలు, రంగంపేట, కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్, కడియం, గోపాలపురం మండలాలున్నాయి. మొత్తంగా 11 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

మెట్ట రైతుల ఎదురుచూపులు

జిల్లాలో 89 శాతం ఆయకట్టుకు నీటి వసతి ఉంది. ఖరీఫ్ సాగుకు సంబంధించి ఇప్పటికే 87 శాతం నారుమళ్ల ప్రక్రియ పూర్తయ్యింది. కొవ్వూరు, చాగల్లు, నల్లజర్ల, కడియం మండలాల్లో నూరు శాతం నారుమళ్లు పోశారు. కనిష్ఠంగా గోకవరం మండలంలో 46 శాతం మాత్రమే నారుమళ్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 4,107 ఎకరాల్లో నాట్లు వేశారు. కొవ్వూరులో అత్యధికంగా 8 శాతం నాట్లు పడ్డాయి. చాగల్లు, సీతానగరం, నిడదవోలు, బిక్కవోలు మండలాల్లోనూ నాట్లు వేగం పుంజుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా చెరువుల కింద, వర్షాధారంగా 11 శాతం ఆయకట్టు ఉంది. పూర్తి వర్షాధారంగా 22,543 హెక్టార్లు సాగు చేస్తున్నారు. రుతుపవనాల ప్రభావంతో నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు మెట్ట రైతులు దుక్కులు దున్నుకున్నారు. అక్కడక్కడ వరి ఆకుమళ్లు పోసిన రైతులు ఇప్పుడు ఎండ వేడిమికి మొలక శాతం దెబ్బ తింటుందని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిస్తే ఖరీఫ్ వ్యవసాయ పనులు మరింత ఊపందుకోనున్నాయి.



కొవ్వూరులో ఆకాశం

క్లుప్తంగా

23 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

తొండంగి: మండలంలోని బెండపూడి జాతీయ రహదారి తమ్మయ్యపేట శివారు రావికంపాడు జంక్షన్ వద్ద 23 కిలోల గంజాయితో యువకుడిని అరెస్టు చేసినట్టు తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తణుకుకు చెందిన యువకుడు ఇమ్మండు సాయి మధుసూదన్ మరో వ్యక్తితో కలిసి గంజాయి మూటతో నిలుచుండగా ఎస్సై రవికుమార్, తన సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నారు. ఇద్దరిలో ఒకరు పరారీలో ఉండగా సాయి మధుసూదన్‌ను అదుపులోకి తీసుకుని 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

చేయందించమంది ఒక ప్రాణం



- వృత్తి ధర్మంలో సంతృప్తి
- సేవా తత్పరతతో జిల్లా వైద్యులు
- నేడు డాక్టర్స్ డే

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దేవుడు ప్రాణాలు పోస్తే.. వైద్యులు ప్రాణాలను కాపాడతారు. అందుకే వైద్యో నారాయణో హరి అన్నారు పెద్దలు. సమాజంలో వైద్య వృత్తికి ఉన్న గౌరవం, ప్రజల ఆరోగ్య సంరక్షణలో వారి భాగస్వామ్యం, వారి సేవలు అమూల్యమైనవి. వైద్యుడు లేని సమాజాన్ని ఊహించడమే కష్టం. ఎన్నో కష్టనష్టాలు ఉన్నా పవిత్రమైన వైద్యవృత్తిని దశాబ్దాలుగా కొనసాగిస్తూ ప్రజల సేవలో సంతృప్తి చెందుతున్న వైద్యులు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. వృత్తిధర్మం పాటించడంతో పాటు పేద ప్రజలకు ఉచిత వైద్యసహాయాన్ని అందిస్తూ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంటున్నారు. నేడు డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

ప్రాణాలను సైతం పణంగా పెట్టి

కరోనా కష్టకాలంలో ఎంతోమంది వైద్యులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి రోగులకు సేవలందించారు. క్లిష్ట పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చిన ఎంతోమంది రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రాణభిక్ష ప్రసాదించిన ఘనత జిల్లాలో వైద్యులది. తమ సంపాదనను కూడా పక్కన పెట్టి ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలకు ప్రభుత్వ వైద్యులకు బాసటగా నిలిచి తమ ఉదారతను చాటుకున్న ప్రయివేటు వైద్యులు ఎందరో ఉన్నారు.

ఎన్నో క్లిష్టతరమైన చికిత్సలు జిల్లాలోనే

గతంలో సాధారణ వ్యాధులకు మాత్రమే జిల్లాలో వైద్యులు అందుబాటులో ఉండేవారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు అందుబాటులో ఉండేవారు కాదు. ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైద్యసేవలు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం స్పెషలిస్టులు అందుబాటులో ఉంటూ ఆధునిక వైద్య సదుపాయాలతో ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నారు. క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు సైతం ఇక్కడే నిర్వహిస్తూ నగరాలతో సమానంగా సేవలందిస్తున్నారు.

సేవల్లో ముందుంటూ. .

జిల్లాలో వైద్యులు తమ సేవా దృక్పథాన్ని, పేదల పట్ల తమ నిబద్ధతను చాటుకుంటూ ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ వైద్యులు సైతం తమ సంపాదన పక్కన పెట్టి వారంలో ఒకరోజు సత్యసాయి చారిటబుల్ ట్రస్ట్, రామకృష్ణమఠం ఇతర సేవా సంస్థలు నిర్వహించే వైద్య శిబిరాల్లో సేవలు అందిస్తున్నారు. కొందరు వైద్యులు తమ ఆసుపత్రిలోనే వారంలో ఒకరోజు ఉచిత వైద్యం అందిస్తూ జనం మన్ననలను పొందుతున్నారు.

18 వందల మంది నిరంతరం రోగుల సేవలో

తూర్పుగోదావరి జిల్లాలో 8,00 మంది వైద్యులు అందుబాటులో ఉంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1,800 మంది ఉన్నారు. తూర్పుగోదావరిలో 450 ఆసుపత్రులు ఉండగా అందులో పనిచేసే వైద్యులు నిరంతరం రోగులు సేవలో ఉంటున్నారు. టీచింగ్ ఆసుపత్రులు, ట్రామాకేర్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యులు అందించే సేవలు మరువలేనివి.

డాక్టర్ అవ్వాలని కలగన్నాను



డాక్టర్ అవ్వాలని కలగన్నాను. అందుకు అనుగుణంగా. ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించాను. డాక్టర్ అయిన రెండు నెలలకే ప్రభుత్వ డాక్టర్‌గా పనిచేసే అవకాశం లభించింది. రూరల్ పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా ప్రస్థానం ప్రారంభించగా నేడు ప్రతిష్టాత్మక ఆరోగ్యశ్రీ పథకానికి జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేసే అదృష్టం లభించింది. చాలామంది పేదలకు ఉచితంగా వైద్యం అందించాలన్న నా ఆలోచన సాకారం అయ్యింది. నలుగురికి ఉపయోగపడే అవకాశం ఆరోగ్యశ్రీలో దక్కింది. ఆరోగ్యశ్రీ పథకం పారదర్శకంగా అమలు అయ్యేందుకు నా వంతు కృషి చేస్తున్నా.

– డాక్టర్ పి.ప్రియాంక, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్

ప్రాణం నిలబెట్టడానికి నిద్రలేని రాత్రులెన్నో గడిపా



ఒక ప్రాణం నిలబెట్టడానికి నిద్రలేని రాత్రులు గడిపిన రోజులెన్నో ఉన్నాయి. డ్యూటీ ముగించుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో సడన్ హార్ట్ టాక్‌తో వస్తే 100 షాక్‌లు ఇచ్చి తెల్లవారు జాము మూడింటి వరకు ప్రయత్నం చేసి రోగిని కాపాడిన సందర్భం ఉంది. అయితే ఒకతను ఇంత కష్టపడ్డారు ఎంత తీసుకుంటారు అని అడిగాడు. రోగి హార్ట్ టాక్‌తో చనిపోయేందుకు కొన్ని క్షణాలే ఉన్నాయి, ఆ సమయంలో ఈ ప్రశ్న అడిగుంటే రోగి బతికేవాడు కాదు. నేను అక్కడ డబ్బులు కోసం కష్టపడలేదు. నిండు ప్రాణాన్ని నిలబెట్టాలి అని సవాల్‌గా పనిచేశాను. ఆ కష్టం ఫలించడంతో వారిచ్చిన డబ్బుకు నా ముందు విలువ లేదు. ఇలాంటి కేసులు ఎన్నో చేశాను. ఆరోగ్య శ్రీ వచ్చాక తేలికగా వైద్యం చేస్తున్నాం.

–డాక్టర్ రామరాజు, గుండె వ్యాధి నిపుణులు, కిమ్స్ బొల్లినేని

మాకు దేవుడు ఇచ్చిన అవకాశం



జీవనం సాగించేందుకు ప్రపంచంలో ఎన్నో వృత్తులు, ఉపాధి అవకాశాలు ఉన్నాయి. అయితే ప్రాణాలను కబళించే రోగాలకు దగ్గరగా ఉండే వైద్యులు రోగిని కాపాడేందుకు ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. అయితే వైద్య వృత్తి అనేది చాలా పవిత్రమైనదిగా మేము చూస్తాం. ఇది భగవంతుడు మాకు ఇచ్చిన అవకాశం. తమకు వచ్చిన రుగ్మత కారణంగా ఎంతో ఆందోళనతో ఆసుపత్రులకు వచ్చే రోగులు తమ రోగం నయమై ఆరోగ్యంగా తిరిగి వెళుతుంటారు. ఆ సమయంలో వారి కళ్లలో ఆనందం చూసి మేం ఎంతో సంతృప్తి చెందుతాం. ఏ వైద్యుడైనా రోగి ప్రాణాలు కాపాడాలనే చూస్తాడు. రోగి కోలుకున్న సందర్భంలో వైద్యుడు గొప్పవాడు, రోగి విఫలమైన సందర్భంలో వైద్యుడిది తప్పు అన్న భావన ప్రజలు విడనాడాలి.

–డాక్టర్ సురేష్, వద్దాది ఆసుపత్రి, రాజమహేంద్రవరం

దొంగ అరెస్ట్ : 5 లక్షల సొత్తు స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటి చోరీలకు పాల్పడే పాత నేరస్తుడిని రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.5 లక్షల విలువగల చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో దక్షిణ మండల డీఎస్పీ కె.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ టి.గణేష్, ఎస్సై జీవీవీ సత్యనారాయణ వివరాలు తెలిపారు. నేరాల దర్యాప్తులో భాగంగా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు నేరస్తుల కదలికలపై నిఘా పెట్టిన టూ టౌన్ పోలీసులకు శుక్రవారం సాయంత్రం తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి తారస పడ్డాడు. అతడిని ప్రశ్నించగా హైదరాబాద్ రావునగర్‌కు చెందిన పాత నేరస్తుడు చెల్లే జాషువాగా తెలిసింది. అతడిని లోతుగా విచారించగా రాజమహేంద్రవరం 2వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధి ఆల్కట్ గార్డెన్స్‌లో గత ఏడాది ఏప్రిల్ నెలలో, ఈ ఏడాది జూన్ నెలలో రెండు ఇళ్లలో బంగారం చోరీ చేసినట్టు అంగీకరించాడు. విజయవాడ, ఇబ్రహీంపట్నం, విశాఖ జిల్లా దువ్వాడ, గోపాలపట్నం, పెందుర్తి, ఎయిర్‌పోర్ట్ స్టేషన్ పరిధిలో పలు నేరాలు చేసినట్టు అంగీకరించాడు. అతడి నుంచి 90 గ్రాముల బంగారం, ఒక ల్యాప్‌టాప్, వెండి పట్టీలు మొత్తం రూ.5లక్షల విలువగల చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో మొత్తం తొమ్మిది చోరీలు, కడియం, రావులపాలెం, గోపాలపురం పరిధిలో 14 చోరీలు చేసి జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అతడిపై హైదరాబాద్ పోలీసు స్టేషన్లో సస్పెక్ట్ షీట్ ఉందని డీఎస్పీ తెలిపారు. నిందితుడు రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న ఇళ్లను ఎంచుకుని రైలెక్కి వచ్చి చోరీ చేసి తిరిగి రైలులో వెళ్లిపోతుంటాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడం, చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ టి.గణేష్, ఎస్సై జీవీవీ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబును అభినందించారు. కానిస్టేబుళ్లకు రివార్డు ఇస్తామన్నారు.



పట్టుకున్న చోరీ సొత్తును చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ గణేష్

ఎల్‌హెచ్‌ఎంఎస్ సద్వినియోగం చేసుకోండి

ప్రజలు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర పనిమీద ఊరు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా అర్బన్ జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సేవ పూర్తిగా ఉచితమని, గ్రామాంతరం వెళ్లేవారు స్థానిక పోలీసు స్టేషన్లో సమాచారం అందిస్తే పోలీసు సిబ్బంది వచ్చి కెమెరా అమర్చి వెళతారని, తిరిగి ఇంటి యజమాని వచ్చేవరకూ పోలీసుల నిఘాలో ఆ ఇల్లు ఉంటుందని, దీనివల్ల నేరాలు నియంత్రించవచ్చని డీఎస్పీ తెలిపారు.

ఒంగోలు ఆవుకు రెండు కపిల దూడల జననం

ఆత్రేయపురం: మండల పరిధిలోని పేరవరం గ్రామానికి చెందిన బి.పెద్దిరాజు గోశాలలో ఒంగోలు ఆవుకు రెండు కపిల దూడలు జన్మించాయి. పెయ్య, గిత్త దూడలకు జననం ఇచ్చింది. దీంతో రైతు పెద్దిరాజు ఆనందం వ్యక్తం చేశాడు. అలాగే పరిసర ప్రాంతాల నుంచి రైతులు వచ్చి కపిల దూడలను చూస్తున్నారు.



ఒంగోలు ఆవుతో కపిల దూడలు

పేరూరులో షూటింగ్ సందడి

అమలాపురం రూరల్: పేరూరు పల్లపు వీధిలో సినిమా సందడి నెలకుంది. విశ్వక్ సేన్ హీరోగా, నేహాశెట్టి హీరోయిన్‌గా నిర్మిస్తున్న వీఎస్11 చిత్రం షూటింగ్ పేరూరులో శరవేగంగా జరుగుతోంది. న్యాయవాది గంటి రామగోపాల్ ఇంటివద్ద చిత్రానికి కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తుండగా సితార ప్రొడక్షన్ సంస్థ నిర్మిస్తోంది. రెండు రోజులుగా జరుగుతున్న సినిమా షూటింగ్‌లో హీరో హీరోయిన్లతో పాటు నటులు నాజర్, హైపర్ ఆది తదితరులు పాల్గొంటున్నారు. మరో రెండు రోజులు షూటింగ్ జరుగుతుంది. ఈ సినిమా కోసం కూరగాయల మార్కెట్. బస్ షెల్టర్ వంటివి ప్రత్యేకంగా సెట్ చేశారు. న్యాయవాది గంటి రామగోపాల్ ఇంటివద్ద షూటింగ్ జరుగుతోంది.

మెరుగైన ఉద్యోగాలు పొందేలా తర్ఫీదు

- నన్నయ్య యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పద్మరాజు
- అచ్చంపేట జంక్షన్ వద్ద ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ సందర్శన

కాకినాడ రూరల్: మెరుగైన ఉద్యోగావకాశాలు పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.పద్మరాజు పేర్కొన్నారు. కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ్య యూనివర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌ను తొలిసారిగా శుక్రవారం ఆయన సందర్శించారు. తొలుత క్యాంపస్‌లో ఐ లవ్ ఏ కే ఎన్ యు గుర్తును ఆవిష్కరించారు. క్యాంపస్‌ను పరిశీలించారు. విద్యార్థులకు గల మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు త్వరలో జరగనున్న అడ్మిషన్లలో ఎక్కువ మంది ఎంఎస్ఎన్ పీజీ సెంటరును ఎంపిక చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి పీజీ సెంటరులో అందుబాటులో ఉన్న కోర్సులు వివరించి, అధ్యాపకులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా వీసీ పద్మరాజు మీడియాతో మాట్లాడుతూ స్థల దాత సత్యలింగ నాయకర్ ఆశయంతో ఎంఎస్ఎన్ క్యాంపస్ వచ్చిందన్నారు. విశాలమైన 50 ఎకరాలు కలిగిన ఈ ప్రాంగణంలో రాబోయే కాలంలో విభిన్న కోర్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. క్యాంపస్‌లో జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు కలిగిన క్రీడా ప్రాంగణంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. పీజీ సెంటరులో ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ ఇంగ్లిషు, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. 330 సీట్లకు గాను సగం వరకు మాత్రమే భర్తీ అవుతున్నందున ఈ ఏడాది పూర్తి స్థాయిలో భర్తీ కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా నన్నయ్య పీజీ సెంటరులో విద్యను అభ్యసించే వారికి జగనన్న విద్యాదీవెన వర్తిస్తుందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వరంగ విద్యా సంస్థలో చదివించేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసరు ప్రశాంతి, డాక్టరు ఎం.పోచయ్య పాల్గొన్నారు.



వీసీ ప్రొఫెసర్ పద్మరాజుకు స్వాగతం పలుకుతున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది

ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం

- రత్నగిరిపై నేటి నుంచే అమలు
- గాజు, కాపర్, స్టీలు బాటిల్స్‌కు అనుమతి

అన్నవరం: రత్నగిరిపై కొలువైన వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శనివారం నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌లో మంచినీటి విక్రయాలను నిలిపివేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల తరహా లో గాజు సీసాలు లేదా కాపర్, స్టీల్ సీసాలు మాత్రమే దేవస్థానంలో అనుమతించాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. నెల రోజుల క్రితమే ఈ మేరకు ఈఓ దేవస్థానంలోని అన్ని షాపులు, క్యాంటీన్ల నిర్వాహకులకు జూన్ 30 వరకు మాత్రమే ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ విక్రయించాలని ఆదేశించారు. కొండపై ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు కూడా అనుమతించరు.



అన్నవరం దేవస్థానం

మంత్రి ఆదేశాలతో..

ఇప్పటికే దేవస్థానంలో ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లు, ఇతర సామగ్రిని నిషేధించారు. కొండ మీద, కొండ దిగువన దేవస్థానం షాపులలో ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందిని ఈఓ ఆదేశించారు. రత్నగిరి దేవస్థానాన్ని ప్లాస్టిక్ రహిత దేవస్థానంగా మార్చేందుకుగాను దేవదాయశాఖ మంత్రి, కమిషనర్ల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని ఈఓ తెలిపారు. దేవస్థానం టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీలు చేసేటపుడు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను తీసివేయాలని వాహనాల తనిఖీ సిబ్బందిని ఆదేశించారు. రత్నగిరిపై సరాసరిన రోజుకు వేయి వాటర్ బాటిల్స్ విక్రయిస్తున్నారు. కార్తికమాసంలో అయితే రోజుకు మూడు వేలకు పైగా వాటర్ బాటిల్స్ విక్రయిస్తారు. ఏడాదికి సరాసరిన ఐదు లక్షలు వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తున్నారనేది ఒక అంచనా.

తిరుమలలో గాజు సీసా రూ.60కి విక్రయం

తిరుమలలో ఈ పద్ధతి ప్రవేశపెట్టినపుడు అనేక విమర్శలు వచ్చినా ఇప్పుడు పరిస్థితి మారిందని దేవస్థానం అధికారులు అంటున్నారు. గాజు వాటర్ బాటిల్ లీటర్ రూ.60కి, 750 ఎంఎల్ బాటిల్ రూ.40కి విక్రయిస్తున్నారు. ఇదే పద్ధతి అన్నవరం దేవస్థానంలో కూడా వ్యాపారస్తులు అమలు చేయాలని అధికారులు అంటున్నారు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
శనివారం ॥ 1-7-2023

మనం మాట్లాడుకోవాల్సిందే!



ప్రతీకాత్మక చిత్రం

ఆధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

•••

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.



ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లీ, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టేస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

•••

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కునేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హార్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!



కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.



విధి నిర్వహణలో క్వాజీ



తల్లిదండ్రులతో...

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఈ ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదదాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటెలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటి, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

"నా నెక్ట్స్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా. నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.

న్యూస్‌మేకర్



సాబ్రి

మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.



డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి



డ్యాన్స్ క్లాస్‌లో ...

■ దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

■ మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కాని వ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్ఠాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.

■ కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్థుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

ది బాస్ లేడీ

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్‌ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...



ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క, ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.



కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్‌షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.